క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి తూముల మమత, నర్సయ్య, హైకోర్టు అడ్వొకేట్ ఝాన్సీచౌదరి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని చెప్పారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ గీకురు రవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఇన్‌చార్జి కక్క రవీందర్, ఉపసర్పంచ్ తోట సతీష్, మండల రైతుబంధు కో ఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, జిల్లా నాయకులు రామోజు కృష్ణమాచారి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళ పనులు చేయాలని, పనులు త్వరగా ముగించుకొని తగిన కూలి పొందాలని ఎంపీపీ చిలుక రవీందర్ సూచించారు. మండలంలోని గుమ్లాపూర్ అయిలకుంటలో సోమవారం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. చేసిన పనులతో వచ్చే వర్షాకాలంలో కుంట నిండి బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. 130 మంది కూలీలు ఈజీఎస్ పనులు చేయడం అభినందనీయమన్నారు. వెంట ఎంపీడీవో స్వరూప, సర్పంచ్ అప్పిడి సౌజన్య, బీసవేని రాజశేఖర్, వెల్మ రఘుపతి రెడ్డి, ముద్దం కుమార్, పెరుమాండ్ల మహేశ్, నాగరాజు, తదితరులున్నారు.

విత్తన శుద్ధి యంత్రాలకు నిధులు సమకూర్చాలి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మానకొండూర్: విత్తన శుద్ధి యంత్రాలకు నిధులు కేటాయించాలని, విత్తన ఉత్పత్తి రైతులు ఆదివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కోరారు. కరీంనగర్ టీఎస్ సీడ్స్ గోదాములను ప్రభుత్వం మెడికల్ కాలేజీ కోసం కేటాయించిందని, దానికి బదులుగా మానకొండూరులో భూమి కేటాయించారని అందులో విత్తన శుద్ధి యంత్రాలను సమకూర్చాలని, వచ్చే సీజన్ వరకు యంత్రాలు బిగించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు కంది వీరారెడ్డి, మండల వీరారెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కడారి ప్రభాకర్ ఉన్నారు.

కిరాణా షాపులో చోరీ



మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి శివారులో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి వెంట ఉన్న కిరాణా షాపులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన కీసరి శ్రీనివాస్ కిరాణా షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. షాపు వెనుక భాగం నుంచి లోపలికి చొరబడి సామాను ఎత్తుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఇదే షాపు నుంచి దొంగలు సుమారు రూ.5 వేలు, ఇతర వస్తువులు చోరీ చేశారని బాధితుడు తెలిపాడు.

సర్వే సరే.. పరిహారమేదీ?

- అకాల వర్షాలతో రైతులకు నష్టం
- పంటలను పరిశీలించిన అధికారులు
- నేలవాలిన మొక్కజొన్న
- ఎకరాకు రూ.10వేల కోసం ఎదురుచూపు



కరీంపేటలో అకాల వర్షానికి నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో(ఫైల్)

శంకరపట్నం: అకాల వర్షాలతో మండలంలో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు చాలా వరకు నష్టపోగా మిగతా పంటలు, తోటలు సాగు చేసిన రైతులు పాక్షికంగా నష్టపోయారు. పంటల నష్టంపై వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వం అందించే ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలోని రామడుగు మండలంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు ఆందోళన చెందొద్దు, వారం రోజుల్లో పంట నష్టంపై సర్వే చేసి ఎకరాకు రూ.10 వేల పంట నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. సర్వే చేసి రోజులు గడుస్తున్నా పరిహారంపై ఎటువంటి స్పందన లేకపోవడంతో రైతులు పరిహారం అందేనా అనే సందిగ్ధంలో ఉన్నారు.

మండలంలో...

ఆరుతడి పంటలు సాగు చేయాలన్న వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వం ప్రకటనతో మండలంలోని రైతులు యాసంగిలో 115 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మార్చిలో కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. ఏరడపల్లి, కొత్తగట్టు, కరీంపేట, మొలంగూర్ గ్రామాల్లోని మొక్కజొన్న నేలవాలింది. కేశవపట్నం గ్రామంలో అకాల వర్షాలకు మామిడి పిందెలు రాలాయి. మొక్కజొన్న పంట నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేశారు. మండలంలోని ఏరడపల్లి, కొత్తగట్టు, కరీంపేట, మొలంగూర్ గ్రామాలకు చెందిన సుమారు వందలోపు రైతులకు సంబంధించి మొత్తం 44.20 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మామిడి పిందెలు రాలినప్పటికీ సంబంధిత అధికారులు సర్వే చేయలేదని సమాచారం.

నష్టపరిహారం అందించాలి



ఆరుతడి పంటలు వేయాలంటే వరిసాగు చేయకుండా మొక్కజొన్న పంట వేశాను. అకాల వర్షాలతో పంటకు తీవ్రనష్టం వాటిల్లింది, వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేసి వివరాలు రాసుకుపోయిండ్రు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– నర్ర వీరారెడ్డి, రైతు, ఏరడపల్లి

ఎకరం నష్టపోయా



కరీంపేట ఎస్సారెస్పీ కాలువ ఎగువన ఉండడంతో కాలువనీరు రాదు. బావుల్లో ఉన్న కొద్ది పాటి నీటితో ఎకరన్నర మొక్కజొన్న వేశాను. అకాల వర్షంతో మొక్కజొన్న నేలకొరిగి నష్టం సంభవించింది. ప్రభుత్వం ఇస్తానన్న రూ.పదివేల పరిహారం ప్రకటనకే పరిమితం కావొద్దు.

– సంబు గట్టయ్య, రైతు, కరీంపేట

నివేదిక అందించాం



మండలంలో అకాల వర్షాలకు మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది, నేలవాలిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించాం. ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేయగానే రైతులకు అందిస్తాం.

– శ్రీనివాస్, ఏవో, శంకరపట్నం

విద్యార్థులు సైబర్ వలకు చిక్కొద్దు

ఏసీపీ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు సైబర్ వలలో చిక్కుకోవద్దని ఏసీపీ వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. హ్యాక్ ఐ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలంగాణ స్టేట్ పోలీస్ ఐటీసెల్ యాప్ రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సరిగా వినియోగించుకుంటే అనేక లాభాలు పొందవచ్చని, అనవసర లింకులు ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం మాతృ శ్రీ కళాశాలల ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐలు రమేశ్, సురేష్, ఎన్‌సీసీ అధికారి, కెప్టెన్ రవీంద్రబాబు, ఎన్‌సీసీ అధికారులు వేణు గోపాల్, సురేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

జమ్మికుంట: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని కరీంనగర్ సీసీఆర్‌బీ ఏసీపీ మదన్‌లాల్ అన్నారు. సోమవారం రాత్రి జమ్మికుంట పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్, వాహనాల ధ్రువ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. తనిఖీ కొనసాగుతుందని ఇప్పటివరకు నలుగురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో కరీంనగర్ ఆర్‌ఐ ఎస్‌కే జాన్‌మియా, టౌన్ సీఐ రమేశ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌టీడీసీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ) చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించారు. జమ్మికుంట బీఆర్‌ఎస్ యూత్ నాయకులు చిన్నాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో శ్రీనివాస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కొలుగూరి సురేష్, గోలి వంశీ, ఎదులపురం రంజీత్, దేవునూరి వినయ్, రాజేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను హైదరాబాద్‌లోని టీఎస్‌టీడీసీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దొంత రమేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కారించారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లారెడ్డి

గన్నేరువరం: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మైలారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఎంపీడీవో స్వాతి, సర్పంచ్ రేణుక, హెచ్‌ఎం శ్రీనివాస్, వైద్యాధికారి సందీప్‌రెడ్డి, విక్రమ్ రెడ్డి, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి సంతోషిని, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సింగాపూర్‌లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంజుల

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మంద మంజులసమ్మిరెడ్డి ప్రారంభించారు. అర్హులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంపు వైద్యాధికారి అభినయ్, డివిజనల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు రఘోత్తమరెడ్డి, జెలేందర్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ లావణ్య, క్యాంప్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్, హెల్త్ అసిస్టెంట్ సదానందం, పంచాయతీ కార్యదర్శి రాము, ఏఎన్‌ఎంలు రాణి, సరోజ, వజ్రమ్మ, ఆశ కార్యకర్తలు వసంత,సరోజన,రమ, అరుణ, తదితరులు ఉన్నారు.

నీచరాజకీయం మానుకోవాలి

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నీచ రాజకీయం మానుకోవాలని ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. చెల్పూర్ సర్పంచ్ మహిళను వేధిస్తే ఆమె ఆత్మహత్యకు పాల్పడితే ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఉద్యమకారులు నర్సింగాపూర్ బాల్‌రాజు, ప్రవీణ్‌యాదవ్‌ను పొట్టనపెట్టుకుంది ఎవరో తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఏకవచనంతో సంబోధించడం సరికాదని, వందలాది మంది బీజేపీ కార్యకర్తలకు ఏదో ఒక రూపంలో సాయం అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ఏ అధికారి ప్రజలను ఇబ్బంది పెట్టినా ఊరుకునేది లేదన్నారు. ప్రకాశ్ అంబేద్కర్ ఎందుకొచ్చారని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలి పాక శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయాలను గౌరవిస్తోంది

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల,మతాల సాంప్రదాయాలను గౌరవిస్తోందని పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ ముస్లింలకు పవిత్ర మాసమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎంపీపీ మమతప్రసాద్, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్, కౌన్సిలర్లు , నాయకులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్నామని చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకట్‌రమణారెడ్డి తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. మిగిలిన గ్రామాల్లో 21 తర్వాత ప్రారంభిస్తామని చెప్పారు. సింగిల్‌విండో డైరెక్టర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



ఇన్‌చార్జి ఎంపీడీవోకు నోటీసు అందిస్తున్న కార్యదర్శులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు అంకుస్, ఇంగ్లె రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో స్వరక్ష దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో అరవింద

తిమ్మాపూర్: మండల సమాఖ్య ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లోని కేజీబీవీలో స్వరక్ష దినోత్సవం నిర్వహించారు. బేటి బచావో బేటి పడావోపై అవగాహన కల్పించారు. లింగ వివక్షత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ, సైబర్ క్రైం తదితర అంశాలు వివరించారు. కార్యక్రమానికి ఏసీడీపీవో అరవింద, ఐకేపీ ఏపీఎం రాయ్ మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, ఐకేపీ సీసీలు, అన్ని గ్రామాల, మండల వీవోఏలు, విద్యార్థులు, కేజీబీవీ హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం కేంద్రానికి చెందిన నగునూరి నర్సాగౌడ్ విద్యుత్ చౌర్యం కేసులో ఆరు నెలల శిక్ష అనుభవించాలని లేదంటే జరిమానా చెల్లించాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.వీరయ్య తీర్పు చెప్పినట్లు కరీంనగర్ విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నర్సాగౌడ్ తన ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా 2017లో విద్యుత్‌ను అక్రమంగా వాడుతూ పట్టుబడ్డాడు. అధికారులు మొదటి తప్పుగా భావించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. కానీ అతను మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడగా అధికారులు పట్టుకొని కరీంనగర్ విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నర్సాగౌడ్‌ను సోమవారం జగిత్యాల కోర్టులో హాజరుపర్చగా జడ్జి విచారణ చేపట్టారు. నేరం రుజువవ్వడంతో అతను ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలి లేదంటే రూ.64,122 జరిమానా చెల్లించాలని తీర్పు వెల్లడించారు. విజిలెన్స్ ఎస్సైలు నిరంజన్ రెడ్డి, నరేష్, సిబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మంటలు ఆర్పివేసే విధానం వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

చొప్పదండి: మంటలు ఆర్పే విధానంపై చొప్పదండి అగ్నిమాపకశాఖ సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా చొప్పదండి డిగ్రీ కళాశాల ఆవరణలో మహిళలకు అగ్ని ప్రమాదాల జాగ్రత్తలను వివరించడంతో పాటు, ఇళ్లలో వాడే సిలిండర్ల నుంచి మంటలు చెలరేగినప్పుడు ఆర్పే విధానం వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం 47 కంటి వెలుగు బృందాలతో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 3, 9, 14, 19, 20, 21, 25, 29, 34, 48, 50, 59వ డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలోని 19, 25వ వార్డుల్లో, మండలంలోని సింగపూర్, పోతిరెడ్డిపేటల్లో, జమ్మికుంట పట్టణంలోని 13వ వార్డు, మండలంలోని శాయంపేట, అంకుసాపూర్ గ్రామాల్లో, వీణవంక మండలంలోని గన్ముక్కుల, మల్లారెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్‌లలో, చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఓగులాపూర్‌లలో, చొప్పదండి మండలంలోని ఆర్నకొండ, కురుమపల్లెల్లో, ఇల్లందకుంట మండలంలోని సీతంపేట, గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, కాసారంలలో, రామడుగు మండలంలోని వెలిచాల, రంగసాయిపల్లి గ్రామాల్లో, కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్‌లలో, కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్, నగునూర్‌లలో, మానకొండూరు మండలంలోని వన్నారం, అన్నారం గ్రామాల్లో, సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, రాయికల్ గ్రామాల్లో, కేశవపట్నం మండలంలోని గద్దపాక, కరీంపేట్, రంగపేట్‌లలో, తిమ్మాపూర్ మండలంలోని రేణిగుంట, పోలంపల్లి, పర్లపల్లి గ్రామాల్లో, గన్నేరువరం మండలంలోని మైలారంలో కంటి వెలుగు బృందాలు పని చేస్తాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌సీసీ కేడెట్ల స్వచ్ఛభారత్

కరీంనగర్‌క్రైం: ఎన్‌సీసీ 9టీ బెటాలియన్ కేడెట్లు, ఎస్సారార్, వివేకానంద కళాశాలల ఎన్‌సీసీ కెడెట్ల ఆధ్వర్యంలో లోయర్ మానేరు డ్యాంపై సోమవారం పునీత్‌సాగర్ కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగించారు. డ్యామ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని సందర్శకులకు సూచించారు. జలాశయం శుభ్రత అందరి బాధ్యత అని వివరించారు. కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ రాజు, కెప్టెన్ కిరణ్‌జ్యోతి, లేక్ ఆర్‌ఎస్సై సురేశ్, 9టీ తెలంగాణ సిబ్బంది మనోహర్, దుర్గారావు, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు. అనంతరం 80 కిలోల ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

జమ్మికుంట: ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కేశవాపూర్‌కు చెందిన కర్నె వెంకటేశ్‌పై అదే గ్రామానికి చెందిన తాడెం రామకృష్ణ, ఓదెలు, శిరీషలు సోమవారం దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సమాచారం

సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కామర్స్ విభాగాధిపతి పి.లక్ష్మినరసింహ మూర్తి, సహాయాచార్యులు డా.జి.శ్రీనివాస్ పర్యవేక్షణలో రిటైల్ మార్కెటింగ్‌పై సర్టిఫికెట్ కోర్స్ సోమవారం ప్రారంభమైందని ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తెలిపారు. మే 9వ తేదీ వరకు కోర్సు కొనసాగుతుందని, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ గొడిశాల పరమేశ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.పి.దినకర్, స్టాఫ్ సెక్రటరీ కె.రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీస్కూల్ మేళా

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ -1, 2 కేంద్రాల్లో సోమవారం ప్రీస్కూల్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మి భూమయ్య మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఆలన, పాలనకు దేవాలయాలుగా మారాయని, రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించాలనే సంకల్పంతో ఆరోగ్యలక్ష్మి పథకం ప్రవేశపెట్టిందన్నారు. చిన్నారుల అభివృద్ధికి తొలి పునాది అంగన్‌వాడీ కేంద్రాలని లబ్ధిదారులకు సరుకులు అందజేశారు. ఐసీడీఎస్ చిహ్నం ఏర్పాటు చేయగా చిన్నారుల తల్లితండ్రులు హాజరయ్యారు. ప్రీస్కూల్ పిల్లలకు అసెస్మెంట్ కార్డులు అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రశాంత, సరిత, ఆశా వర్కర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భగవాన్‌రెడ్డి



కంకణాల భగవాన్‌రెడ్డి



కనుకుంట్ల శంకర్

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కంకణాల భగవాన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల్లో భగవాన్‌రెడ్డి 33 , కడార్ల సాంబమూర్తి 25, అందె వెంకటేశ్వర్‌రావు 17, ఎర్రోళ్ల రమేశ్ 10 ఓట్లు సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా యతిపతి అరుణ్‌కుమార్, కార్యదర్శిగా జైపాల్, కోశాధికారిగా బండి రవీందర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా సౌమిత్ర, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పవన్‌కుమార్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల కమిటీ సభ్యులు టి. సాయన్న, సీకే జేమ్స్, ఎస్.భూంరెడ్డి తెలిపారు.